వైభవంగా యాదగిరీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, మార్చి 15 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగింది. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.15,93,505 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

ధర్మారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

తుర్కపల్లి, మార్చి 15 : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటి అమలులో పూర్తిగా విఫలమైందని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారం, కేశ్యాతండా, జమ్లాతండా, పెద్దతండా గ్రామాల్లో జడ్పీ నిధులు రూ.12.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే సబ్బండ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. తండాలు, గ్రామాలు బీఆర్ఎస్ పాలనలో సమగ్రాభివృద్ధి చెందాయని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, పీఆర్ ఏఈ తులసి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహర్‌సాయి, ధర్మారం మాజీ సర్పంచ్ మంగ్తా పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం

ప్రధానోపాధ్యాయురాలు రాధికకు లక్ష రూపాయల నగదు అందజేస్తున్న కుడుముల సుధాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : మండలంలోని పిలాయిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి విద్యా కమిటీ మాజీ చైర్మన్ కుడుముల యాదిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి శుక్రవారం లక్ష రూపాయల నగదును ప్రధానోపాధ్యాయురాలు కె.రాధికకు అందజేశారు. అదేవిధంగా సప్తవరిణి గోశాలకు చెందిన సత్యనారాయణ రూ.10వేల విలువ చేసే 9 కుర్చీలను బహూకరించారు. అనంతరం దాతలను సన్మానించారు. అమెరికాలో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి తాను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయడం గర్వించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయురాలు రాధిక అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేశ్‌రెడ్డి, విమలాదేవి, జ్యోతి, ఎల్లయ్య, అనూరాధ, సహజీవన్‌రెడ్డి, శ్రీదేవి, అమీర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షల హాల్ టికెట్లను అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు సూచించారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, వీరబ్రహ్మాచారి, నరసింహారావు, అంజయ్య, కవిత, ధనమ్మ, నాగమణి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న వార్డెన్ రాజాలుబాయి

ఆత్మకూరు(ఎం), మార్చి 15 : వసతి గృహంలో ఉండి చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ రాజాలుబాయి అన్నారు. పదో తరగతి విద్యార్థినులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పరీక్ష సామాగ్రిని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భయాందోళనకు గురికాకుండా కృషి, పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు.

రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ

రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తున్న సంఘం చైర్మన్ సత్యనారాయణ

చౌటుప్పల్, మార్చి 15 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో పాడి రైతులకు శుక్రవారం ఉచితంగా గడ్డి విత్తనాలు అందజేశారు. స్థానిక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ గుండెబోయిన సత్యనారాయణ యాదవ్, సభ్యులు ముస్కు మాధవరెడ్డి, అరిగె బీరప్ప, బలికె దాసు, ఎళ్ల ప్రభాకర్‌రెడ్డి, ఎల్లప్ప, గాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదువాలి

రామన్నపేట, మార్చి 15 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలని లయన్స్‌క్లబ్ సభ్యుడు యాపాల కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. పనకంటి భాస్కర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకరయ్య, గోవర్ధనాచారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తాం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం : చీకటిమామిడిలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

బొమ్మలరామారం, మార్చి 15 : నియోజకర్గంలోని రహదారుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని చీకటి మామిడి నుంచి వడపర్తి గ్రామం వరకు రూ.18కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో మండలంలోని అధిక గ్రామాల ప్రజలకు రవాణా సమస్యలు తీరుతాయన్నారు. మండలంలోని ఎర్రగుంట నుంచి ఖాజీపేట చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. హెచ్ఎండీఏ నుంచి మంజూరైన రూ.20కోట్లను తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తామని చెప్పారు. వారం రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుబంధు అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో పార్టీలకతీతంగా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గొడుగు శోభ, మాజీ ఎంపీటీసీ మచ్చ శ్రీనివాస్, నాయకులు మధు, సత్యనారాయణ, శ్రీకాంత్, రాజునాయక్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభం

ఆలేరు రూరల్ : మండలంలోని గొలనుకొండ, శారాజీపేట, టంగుటూరు, కొల్లూరు, మందనపల్లి, కందిగడ్డతండా, శ్రీనివాసపురం, పటేల్‌గూడెం, కొలనుపాక గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్నారు. పార్టీలకతీతంగా అర్హులకు ఇస్తామని చెప్పారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్, పీఆర్ డీఈ హేమంత్‌కుమార్, నాయకులు కుమార్, వెంకటేశ్వర్‌రాజు, ఉపేందర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

తుర్కపల్లి : పండుగలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని సంగ్యాతండాలో నిర్వహించిన హజరత్, సయ్యద్, సుబానిచోటా బాబా దర్గా ఉర్సులో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నాయక్, భాస్కర్‌రెడ్డి, ఉమ్లానాయక్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎంకు వినతి

పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి

రాజాపేట, మార్చి 15 : గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి మాజీ సర్పంచులు గుంటి మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి వినతిపత్రాలు అందజేశారు. గ్రామాల్లో వైకుంఠధామం, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణంతోపాటు సీసీ రోడ్లు చేసి రెండేండ్లు గడిచిందని, పెండింగ్ బిల్లులకు నిధులు కేటాయించాలని కోరారు.

వైభవంగా బసవ లింగేశ్వరస్వామి రథోత్సవం

బసవ లింగేశ్వర రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : మున్సిపాలిటీ పరిధిలోని గంగాపార్వతీ సమేత బసవ లింగేశ్వరస్వామి కల్యాణ రథోత్సవంలో భాగంగా శుక్రవారం పెద్ద రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన రథంపై పార్వతీ, పరమేశ్వరులను ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, ధర్మకర్తలు లక్ష్మణ్, పురుషోత్తం, మహేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, యాదిరెడ్డి, మహేశ్, చంద్రయ్య, ప్రేమ్‌కుమార్, స్వరూప, యాదయ్య, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో పూజలు

ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ

రాజాపేట, మార్చి 15 : మండలంలోని రేణికుంట గ్రామ శివారులో రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో పీఠాధిపతులు శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ, శ్రీమాన్ బీవీఆర్‌బీజీర్‌కే గౌతమ్ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగో రోజు ప్రాణ ప్రతిష్ఠ పూజలు కొనసాగాయి.

ఈ సందర్భంగా సంకల్పం, పుణ్యాహవాచకం, సప్త కలశారాధన, వాస్తు హోమం, మహాశాంతి హోమం, క్షీరాధివాసం, ఆవాహన అర్చన పూజలు నిర్వహించారు. కార్యకమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కూర కల్యాణీబద్రీనాథ్, కుంబాల శోభారాణీఎల్లారెడ్డి, సూదిరెడ్డి కళావతీనాగిరెడ్డి, శ్రీవట్టం మంజులారాఘవేంద్ర, సమ్మెట రాజేశ్వరీశ్రీనివాస్‌రావు, నరేశ్, భక్తులు పాల్గొన్నారు.

వలిగొండలో యువకుడి ఆత్మహత్య

వలిగొండ, మార్చి 15 : ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న జంగాల కాలనీకి చెందిన మోటం అనిల్ (23)కు వివాహం చేయగా ఇటీవల విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసైన అనిల్.. గురువారం ఇంట్లో తల్లి గౌరమ్మను కొట్టి రూ.8వేలు తీసుకొని వెళ్లిపోయాడు. అనంతరం మద్యం సేవించి రాత్రి కాలనీలోని వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ డి.మహేందర్‌లాల్ సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

బీబీనగర్, మార్చి 15 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా సైనిక డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామక పాండురంగశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 20లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

భువనగిరి అర్బన్, మార్చి 15 : జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి ఆమోదయోగ్యమయ్యే అన్ని కేసులను, సివిల్, క్రిమినల్, కోర్టు ముందుకు రానటువంటి కేసులను కూడా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హజ్ కమిటీ సభ్యుడు షర్ఫొద్దీన్‌కు సన్మానం

గుండాల, మార్చి 15 : రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎండీ షర్ఫొద్దీన్‌ను మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ కమిటీలో షర్ఫొద్దీన్‌కు చోటు దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, నాయకులు అన్వర్, బురాన్, అక్బర్, సిరాజ్, కుత్బుద్దీన్, అబ్బాస్, యాకూబ్ పాషా, యాకూబ్, మౌలానా ఫిరోజ్, సఫాన్ పాల్గొన్నారు.

గుండాల మసీదులో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు షర్ఫొద్దీన్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

కాన్షీరామ్‌కు నివాళి

చౌటుప్పల్‌లో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

చౌటుప్పల్, మార్చి 15 : బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 90వ జయంతిని పట్టణ కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహుజనుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎర్ర దానయ్య, మస్కు నర్సింహ, టి.సుభాశ్‌చంద్రబోస్, కత్తుల పద్మ, సుక్క లింగస్వామి, కత్తుల నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో కాన్షీరాం చిత్రపటానికి బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పావురాల నర్సింహ యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాలను రాజకీయంగా ఏకం చేసి రాజ్యాధికారాన్ని అందించిన యోధుడు కాన్షీరాం అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేడి సంతోష్, మహిళా కన్వీనర్ బందెల అనిత, మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి నర్సింహ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ మండలాధ్యక్షుడు మందుల నాగరాజు అధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మందుల చంటి మహాజన్, గూడెల్లి నరేశ్, మందుల శ్రీకాంత్, మందుల శేఖర్, సుజాత, సురేశ్ పాల్గొన్నారు.

నాగారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, మార్చి 15 : గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంగెం, గోకారం, జాలుకాల్వ, నాగారం, వలిగొండ, పులిగిల్ల, మొగిలిపాక, వెల్వర్తి గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్య పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేస్తున్నామని, మిగతా వాటి అమలు కోసం ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, నాయకులు నాగేశ్వర్, యశోద, భాగ్యమ్మ, సత్తమ్మ, ఎల్లయ్య, సత్తిరెడ్డి, రవి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పశువులకు గాలి కుంటు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోకారంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి సదానందం, ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల ప్రగతే సర్కారు ధ్యేయం

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు : ధర్మారంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు/ అడ్డగూడూరు, మార్చి 15 : నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరు మండలంలోని పాలడుగు, దత్తప్పగూడెం, సదర్శాపురంలో సీసీ రోడ్లు, దత్తప్పగూడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అడ్డగూడూరు మండలం ధర్మారంలో రూ.15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, బిక్కేరవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తుందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు పైళ్ల సోమిరెడ్డి, కంచర్ల యాదిగిరిరెడ్డి, మరిపెల్లి యాదయ్య, అంతటి నర్సయ్య, నర్సిరెడ్డి, పాశం సత్యనారాయణ, దాసరి భిక్షం, తాడోజు లక్ష్మణాచారి, రాచకొండ రమేశ్, మందుల వెంకటేశ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజారోహణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గరుడ ఛాయాధివాసం హవనం బేరీ పూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, మహా నివేదనం పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, నాయకులు అభిలాష్ రెడ్డి, సత్తిరెడ్డి, అంజిరెడ్డి, నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రానికి రెండు అవార్డులు

అవార్డులు అందుకుంటున్న చిత్ర నిర్మాత, దర్శకుడు

చౌటుప్పల్, మార్చి 15 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా ఇటీవల రూపొందించిన యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ ఎక్స్‌పరిమెంటల్ చిత్రానికి అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ -2024కు సంబంధించి రెండు అవార్డులు వచ్చాయి. బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకాన్ ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డులు లభించాయి. ఈ అవార్డులను ముంబయిలోని కంబల్ల హాల్‌లో చిత్ర నిర్మాత తిరందాసు ధనుంజయ, దర్శకుడు బడుగు విజయ్‌కుమార్ శుక్రవారం అందుకున్నారు. అవార్డులు రావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, మార్చి 15 : మున్సిపాలిటీ పరిధిలోని 11, 19వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, ఆలె నాగరాజు, నాయకులు నర్సింహ గౌడ్, భిక్షపతి, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.